క్లుప్తంగా

ఓటు వినియోగించుకున్న ఐసీఏఎస్ అధికారి


స్వగ్రామం వచ్చి, ఓటు వేసిన ఐసీఏఎస్ ప్రియాంక నాషిన్

రేగిడి: ఐసీఏఎస్ ప్రియాంక నాషిన్ ఓటుహక్కు వినియోగించుకున్నారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆమె స్వగ్రామమైన మండలంలోని ఆడవరం వచ్చి మరీ ఓటు వేసి, ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటారు. ఆమె నాలుగు రాష్ట్రాల ఆర్థిక శాఖ సహాయక కంట్రోలర్ జనరల్‌గా(ఐసీఏఎస్) పనిచేస్తున్నారు. ఎంతో బిజీబిజీగా ఉండే ఆమె ఓటు వేసేందుకు స్వగ్రామం రావడం, ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవడం ఆదర్శనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సత్యసాయి భక్తుల సేవాభావం


మజ్జిగ పంపిణీ చేస్తున్న సత్యసాయి భక్తులు

రాజాం: సత్యసాయి భక్తులు సేవాభావం చాటుకున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల పోలింగ్ కేంద్రాల సమీపంలో సోమవారం చలివేంద్రాలు ఏర్పాటు చేసి, ఓటర్లకు మజ్జిగ అందజేశారు. వేసవి నేపథ్యంలో ఓటర్ల దాహార్తి తీర్చేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

టీడీపీ దౌర్జన్యం


రాజాం పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పోలింగ్ కేంద్రం గేటు వద్ద గుమిగూడిన టీడీపీ కార్యకర్తలు

రాజాం: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న పోలింగ్ కేంద్రం వద్ద కొంతమంది టీడీపీ కార్యకర్తలు సోమవారం దౌర్జన్యానికి పాల్పడ్డారు. పోలింగ్ కేంద్రంలోకి ఐదు నుంచి పది మంది వరకు ఒకే దఫా చొరబడడం, ఓటర్లను మభ్యపెట్టడం వంటివి చేశారు. పోలీసులు, ఎన్నికల సిబ్బంది హెచ్చరించినా మళ్లీమళ్లీ అదే పనిగా వ్యవహరించి, ఓటర్లను ఇబ్బందులకు గురిచేశారు. బొద్దాం జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఓ టీడీపీ కార్యకర్త డమ్మీ ఈవీఎం పట్టుకుని, సైకిల్‌కు ఓటేయాలని అత్యుత్సాహం ప్రదర్శించాడు.

రేగిడిలో భారీ వర్షం


రేగిడిలో కురుస్తున్న వర్షం

రేగిడి: మండలంలో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా మేఘావృతమై చిరుగాలులతో కూడిన వర్షం కురిసింది. వేసవి ఎండల కారణంగా తీవ్రమైన ఉక్కపోతతో సతమతమైన ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనాన్ని ఇచ్చింది.

ఓటు వినియోగించుకున్న 104 ఏళ్ల వృద్ధురాలు


ఓటుహక్కు వినియోగించుకున్న గున్నరాజమ్మ

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని బుక్కా వీధికి చెందిన 104 ఏళ్ల మండా గున్నరాజమ్మ అనే వృద్ధురాలు సోమవారం తన ఓటుహక్కును వినియోగించుకుంది. సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని, స్థానిక సారధి బాలికల పాఠశాలలోని పోలింగ్ బూత్‌కు కుటుంబీకుల సహాయంతో సోమవారం వెళ్లిన ఆమె నేను సైతం అంటూ ఓటు వేసి, ప్రజాస్వామ్య స్ఫూర్తి కనబరిచారు. ఓటు ఉన్నా ఓటు వేసేందుకు ముందుకురాని వారికి ఆమె ఆదర్శంగా నిలిచిందని అభిప్రాయపడుతున్నారు.

గతం కంటే ఎక్కువ మెజార్టీ

• బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: గతం కంటే ఎక్కువ మెజార్టీతో గెలుస్తానని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మోపాడ పాఠశాలలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, సతీమణి పద్మావతితో కలిసి సోమవారం ఓటు వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోలింగ్‌లో మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఓటుహక్కు వినియోగించుకుంటున్నారని తెలిపారు.

పోలింగ్ ప్రశాంతం


తెర్లాంలో పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు


తెర్లాం: పెరుమాళిలో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో మహిళా ఓటర్లు


తెర్లాం: పెరుమాళి పోలింగ్ కేంద్రానికి కుమార్తె సహాయంతో ఓటు వేయడానికి వెళ్తున్న వృద్ధురాలు


తెర్లాం: పెరుమాళిలో ఓటు వేసేందుకు వీల్‌చైర్‌పై వెళ్తున్న వృద్ధుడు


బాడంగి: మండల కేంద్రంలో క్యూలైన్‌లో ఓటర్లు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా, ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు బారులుతీరారు. ఎంతో ఓపికగా క్యూలైన్లలో నిలబడి ఓటు వేసి, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కనబరిచారు. శాంతిభద్రతలకు ఇబ్బంది కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం సహా పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ విధించారు. ఈవీఎంలు మొరాయించిన పలుచోట్ల పోలింగ్ కాసేపు ఆలస్యమవ్వగా, తిరిగి ప్రారంభమైన ఓటింగ్‌లో ఓటర్లు పాల్గొని, ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. రాత్రి 10.30 గంటలు నాటికి రాజాం నియోజకవర్గంలో 76 శాతం, బొబ్బిలి నియోజకవర్గంలో 78.75 శాతం పోలింగ్ నమోదైనట్లు సమాచారం.

– బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్.


రామభద్రపురం పోలింగ్ కేంద్రానికి పోటెత్తిన ఓటర్లు


రామభద్రపురం: వీల్‌చైర్‌పై పోలింగ్ కేంద్రానికి వృద్ధురాలిని తరలిస్తున్న బంధువులు


బొబ్బిలి: పక్కిలో పోలింగ్‌ను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు


రాజాం: రాత్రి 9 గంటలైనా మొగిలివలసలో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న ఓటర్లు


బొబ్బిలి: రాత్రి 7 గంటలు దాటినా పక్కి గ్రామంలో కొనసాగుతున్న పోలింగ్


బొబ్బిలి: గొల్లపల్లిలో పోలింగ్ సరళి పరిశీలనలో ఎమ్మెల్యే శంబంగి, మాజీ మంత్రి జగన్మోహనరావు


బాడంగి: ముగడ పోలింగ్ కేంద్రం సందర్శనలో ఎమ్మెల్యే శంబంగి


బాడంగి: ఓటర్లతో కిక్కిరిసిన గొల్లాది పోలింగ్ కేంద్రం


సంతకవిటి: తాలాడలో ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో వృద్ధురాలిని తరలిస్తున్న దృశ్యం


రాజాం: బొద్దాంలో ఓటు వేసేందుకు ఆసక్తిగా క్యూలైన్‌లో ఉన్న మహిళలు


సంతకవిటి: గుళ్లసీతారాంపురంలో క్యూలైన్‌లో ఓటర్లు


వంగర: వంగర పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల పిల్లల సంరక్షణలో అంగన్‌వాడీ, వైద్యారోగ్య సిబ్బంది


రాజాం: బొద్దాంలో పోలింగ్ కేంద్రం వద్ద వైద్య శిబిరంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న వైద్య సిబ్బంది


వంగర: తలగాంలో క్యూలైన్‌లో ఓటర్లు


రేగిడి: అంబఖండిలో క్యూలైన్‌లో ఓటర్లు


వంగర: కె.కొత్తవలసలో ఓటు వేసేందుకు వృద్ధురాలిని తరలిస్తున్న దృశ్యం


రాజాం సిటీ: బజారు పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు ఇలా..


బొబ్బిలి: అలజంగిలో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిల్చొన్న ఓటర్లు

పోలింగ్ కేంద్రం పరిశీలన


పోలింగ్ తీరుపై ఆరాతీస్తున్న ఎన్నికల జిల్లా పరిశీలకుడు ఇక్బాల్

తెర్లాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల జిల్లా పరిశీలకుడు ఇక్బాల్ సోమవారం పరిశీలించారు. కేంద్రంలోని నాలుగు బూత్‌లను సందర్శించిన ఆయన పోలింగ్ జరుగుతున్న తీరు, ఏర్పాట్లను తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో మధుసూదనరావులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఓట్లు వేసేందుకు వస్తున్న ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

రాజాం సిటీ: పట్టణంతో పాటు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ పరిశీలించారు. అక్కడి జరుగుతున్న పోలింగ్ సరళిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలింగ్ ఏజెంట్ల వద్ద సెల్‌ఫోన్లు ఉన్నాయని పలువురు ఆమె దృష్టికి తీసుకురాగా, వారి నుంచి ఫోన్లను రికవరీ చేశారు. పోలింగ్ ముగిసేంత వరకు ఎవరూ ఫోన్లు వినియోగించకూడదని ఆమె సూచించారు.


రాజాం సిటీ: పోలింగ్ ఏజెంట్లకు సూచనలిస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

ఎన్నికల పీవో అత్యుత్సాహం

రేగిడి: మండలంలోని అంబఖండి పోలింగ్ కేంద్రం వద్ద 95వ నంబర్ పోలింగ్ బూత్ వద్ద ఎన్నికల పీవో జానకీరావు అత్యుత్సాహం ప్రదర్శించి, విమర్శల పాలయ్యారు. ఓటింగ్ వేసేందుకు వచ్చిన ఓటర్లకు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఆయన ఒత్తిడి చేయడం చూసిన కొంతమంది ఓటర్లు ఆగ్రహించి, నిరసన తెలిపారు. పీవోను ఎన్నికల విధుల నుంచి తప్పించేంత వరకు తాము ఓటు వేయమని ఎన్నికల అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడ స్వల్ప వివాదం చోటుచేసుకుంది. పీవో దురుసుగా ప్రవర్తించి, ఓటర్లపై విరుచుకుపడగా, పీవోపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఓటర్లు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి, వివాదాన్ని సద్దుమణిగించారు. ఓటర్ల వద్ద నుంచి ఫిర్యాదు తీసుకున్న తహసీల్దార్ ఘటనపై ఆరాతీశారు. పీవోను అక్కడి విధుల నుంచి తప్పించి, కొత్త పీవోను ఏర్పాటు చేశారు.


అంబఖండిలో పీవో జానకీరావును నిలదీస్తున్న ఓటర్లు

మొరాయించిన ఈవీఎంలు

తెర్లాం/రేగిడి/రాజాం: మండలాల్లోని పలుచోట్ల ఈవీఎంలు మొరాయించాయి. అప్రమత్తమైన అధికారులు వాటి స్థానంలోకి కొత్త ఈవీఎంలు తీసుకువచ్చి, పోలింగ్ ప్రక్రియను కొనసాగించారు. రేగిడి మండలంలోని అప్పాపురం, కోడిశ గ్రామాలు, రాజాం మండలంలోని గార్రాజుచీపురుపల్లి, తెర్లాం మండలంలోని పెరుమాళి గ్రామ 240 పోలింగ్‌బూత్ ఈవీఎంలు పనిచేయడం కాసేపు ఆగిపోయాయి. దీంతో గంట నుంచి రెండు గంటల పాటు ఓటర్లు ఓటు వేసేందుకు నిరీక్షించారు. పనిచేయని ఈవీఎంల స్థానంలో కొన్ని కొత్తవాటిని తీసుకురాగా, మరికొన్నింటిని బాగుచేసి, ఓటింగ్ ప్రక్రియను కొనసాగించారు. ఓటర్లు కూడా ఎంతో సహనంతో నిరీక్షించి, తమ ఓటును వేశారు.


పెరుమాళిలో మొరాయించిన ఈవీఎంను బాగు చేయిస్తున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి